కథ

# అద్దె

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు

**తలుపులు మూసుకుని గదిలో పడక్కుర్చీలో కూర్చున్నాను. తలుపవతల ఏం జరుగుతోందో నాకు తెలుసు. రాజారావు ఇల్లు ఖాళీ చేసి వెళుతున్నాడు.**

**కారణం.... మా ఇద్దరి మంచితనం.**

**ఇల్లు అద్దెకిచ్చిన నేను... అద్దెకున్న అతను... ఇద్దరూ మంచివాళ్ళయితే మరి అతగాడు ఖాళీ చేయడమెందుకని కదూ మీ డౌటు. చెబుతాను.**

****

రిటైరయ్యే రెండేళ్ళ ముందే రెండు వాటాల ఈ ఇల్లు కట్టుకున్నాను.

నేనా పని చేసింది ప్రైవేటు ఆఫీసులో. రెక్కాడినన్నాళ్ళు కష్టపడి పిల్లలిద్దర్నీ పెంచి పెద్దచేశాను. ఇహ రిటైర్మెంట్ తర్వాత చేతికొచ్చే పిఎఫ్, గ్రాట్యుటీ తప్ప తర్వాత జీవితగమనానికి పెన్షన్ ఆధారం వుండదు.

అందుకే నాకూ, మా ఆవిడకీ ఇబ్బంది కలగకుండా ఇలా ఇల్లు కట్టించుకున్నాను. నాకొచ్చిన డబ్బుని ఫిక్సిడ్ చేసి దానిమీద వచ్చేదానికి, ఒక వాటా అద్దెకిస్తే వచ్చే అద్దె డబ్బు వేణ్ణీళ్ళకి చన్నీళ్ళ తోడవుతుందని నా ఆలోచన. అందుకే సర్వీసులో వుండగానే జాగ్రత్త పడ్డాను.

అబ్బాయికి రెక్కలొచ్చి విదేశాల్లో సెటిలైపోయాడు. అమ్మాయి రూర్కేలాలో భర్తతో హాయిగా కాపురం చేసుకుంటోంది. సెల్ ఫోన్లో అప్పుడప్పుడు వాళ్ళ మాటలు వినిపించడం తప్ప కనిపించడం ఎప్పుడో మానేశారు.

ఆరేళ్ళ క్రితం ఇంటి గేటుకి 'అద్దెకివ్వబడును' అని బోర్డుపెట్టి విశాలంగా విస్తరించుకుని వున్న మామిడి చెట్టుక్రింద వాలుకుర్చీ వేసుకుని పేపర్ చదువుకుంటుంటే 'ఇల్లు అద్దెకి కావాలంటూ' వచ్చాడు రాజారావు.

"అబ్బాయీ. అద్దె నాకు అవసరమైనా... మరీ డబ్బు కోసం మాత్రం కాదు అద్దెకివ్వడం. ఏదో ముసలివాళ్ళం... మాలో కలిసిపోయి... మాకు కాస్త చేదోడు వాదోడుగా వుండేవాళ్ళు కావాలి. అందుకని నువ్వు అమ్మాయినీ, పిల్లల్నీ ఆదివారం తీసుకొస్తే... మీరు మాకూ, మేము మీకూ నచ్చితే... మీరు నిరభ్యంతరంగా పాలుపొంగించుకుని ఇంట్లోకి దిగుపోవచ్చు" అన్నాను.

అతను 'అలాగే' అని తలూపి... ఆదివారం వాళ్ళావిడ్నీ, పిల్లల్నీ తీసుకు వచ్చాడు. వాళ్ళావిడ కుందనపు బొమ్మలా వుంది. కలుపుగోలు మనిషి... మా ఆవిడతో... నాతో ఇట్టే కలిసిపోయింది. పిల్లలు కూడా బాపూ సినిమాలోని పిల్లల్లా చూడ ముచ్చటగా వున్నారు. ముఖ్యంగా ఆ చిన్న వయసులో వుండే ఆకతాయితనమూ... అల్లరి తనమూ మచ్చుకైనా వాళ్ళలో కనిపించలేదు. వాళ్ళని చూస్తుంటే బాగా దగ్గరి వాళ్ళన్నంత భావన మనసులో కలుగుతోంది. వాళ్ళు ఇంట్లోకి రావడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను.

నేనేమి అడక్కుండానే రాజారావు రెండు నెలల అద్దె అడ్వాన్స్‌గా నా చేతిలో పెట్టాడు.

నేను కంగారుగా "నేను ముందే చెప్పానుగా డబ్బు మనిషిని కానని... మీరు వచ్చి కాస్త కుదుట పడ్డాక ఇద్దువు గాని, తొందరేముంది?" అన్నాను మాటల్లో కాస్త మొహమాటాన్ని కలగలిపి.

"ఫర్వాలేదండీ... మీ ఇబ్బందులు మీకుంటాయి" అన్నాడు.

అన్నట్టుగానే ఆదివారం మంచిరోజు కాబట్టి పక్క వాటాలోకి దిగిపోయారు. నిజం చెప్పొద్దూ, వాళ్ళొచ్చాక ఇంటికి వసంత శోభ వచ్చినట్టుంది. ముఖ్యంగా మా ముసలివాళ్ళకి గొప్ప కాలక్షేపం.

అబ్బాయి ఆఫీసుకి... పిల్లలు స్కూలుకీ వెళ్ళిపోయాక తను ఇక మా సేవలో వుంటుంది. నాకు పురాణ సంబంధ పుస్తకాలు చదివి వినిపిస్తూ... మా ఆవిడకి వంటలో సహాయపడుతూ తిరగలి చక్రంలా తిరుగుతుంది. పిల్లలు స్కూలు నుండి వచ్చాక హోం వర్కులు రాసుకుంటూ 'తాతయ్యా... ఈ లెక్క ఎలా చేయాలి?... ఈ ప్రశ్నకి సమాధానం





PREVIOUS NEXT

ఎలా రాయాలంటూ' నా చుట్టూ తిరిగే బుల్లి తుమ్మెదలవుతారు.

రాజారావు మాత్రం తక్కువా ? నన్ను రంధనుగా మెడికల్ చెకప్‌కి తీసుకెళ్ళడం... మందులవీ ఇప్పించడం చేస్తున్నాడు. అంతేకాదు... పొద్దున్నే వాకింగ్‌కి కూడా తీసుకెళుతున్నాడు. అతను పక్కవాటాలోకి అద్దెకి వచ్చే వరకూ నేను ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే వాడిని కాదు. అస్తమించబోతున్న సూర్యుడికి హంగులెందుకన్నది నా ఆలోచన. ఏదేమైనా వాళ్ళ కుటుంబాన్ని చూస్తే మా అమ్మాయి, అబ్బాయి... మనవళ్ళు దగ్గర లేని లోటు తీరినట్టుగా అనిపిస్తోంది. అది మాలో నూతనోత్తేజం కలగజేస్తోందన్నది వాస్తవం.

ఇంతలా మాలో కలిసిపోయినా, పొరబాటున కూడా ఇంటికి సంబంధించి స్వంత నిర్ణయాలు తీసుకునే వారు కాదు. ఇంటిని జాగ్రత్తగా చూసుకునేవారు. ఇంట్లో కూడా అపరిశుభ్ర వాతావరణం కనిపించేది కాదు. గోడలకి మేకులు కొట్టడం... అర్ధరాత్రులు గేటు తీసుకుని రావడం అన్నలుండేవి కాదు. చుట్టాలొచ్చినా మమ్మల్ని గౌరవప్రదంగా పరిచయం చేసి వాళ్ళా ఇంటిని శుభ్రంగా చూసుకునేట్టు చేసేవారు. రాజారావు కూడా ఇంటి అద్దె ఖచ్చితంగా ప్రతినెలా అయిదో తారీకున ఇంటికి తెచ్చిచ్చేవాడు. సంవత్సర క్యాలండరు మారంగానే పది శాతం పెంచిన అద్దె ఇచ్చేవాడు.

"అదేంటి, నేను అద్దె పెంచలేదు కదా" అంటే.

''మీకవా ఖర్చులుంటాయి... ధరలు భయంకరంగా పెరిగిపోతున్నాయి... నేను ఉద్యోగం చేస్తున్నాను. పాపం మీకు ఇదే కదా ఆధారం ! అందుచేత కాదనకండి" అనేవాడు.

ఒక ఇంటి ఓనర్‌కి ఇంతకన్నా ఏం కావాలి ? నా కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.


అలా తెలియకుండా ఆరేళ్ళు గడిచిపోయాయి. విధి చాలా విచిత్రమైంది. ఎప్పుడూ ఒకేలా.. ఏ సమస్యా లేకుండా వుంటే దానికి మజా ఏముంటుంది? ఒక రోజు అతని కొలీగ్ ప్రకాశం అతని కోసం వచ్చి ఆఫీసుకి సంబంధించిన ఒక చేదు వార్త చెప్పాడు. అదేమిటంటే రాజారావు పనిచేసే సంస్థ నష్టాల్లో పడింది. అతనికి మూడు నెలల నుండి జీతం రావడం లేదు.

'అయితే అతను దాచుకున్న దాంట్లోంచి అద్దె కడుతున్నాడన్నమాట' నాకు మనసంతా కలచివేసినట్టు అనిపించింది.

నేను సాయంత్రం అతనొచ్చాక "నువ్వు నన్ను తండ్రిలా చూసుకుంటున్నావని ఆనందపడ్డాను. కాని... నువ్వు నన్ను పరాయిని చేసి.... కష్టాలు పడుతూ అద్దె చేతిలో పెడతావనుకోలేదు" అని నిలదీశాను.

''చూడండీ... మనిషన్నాక సమస్యలు వుంటాయి. ఈ ఇల్లు ధర్మసత్రం కాదు. మీకేమీ ఈ





ఇల్లు తాతముత్తాతల నుండీ అప్పనంగా రాలేదు. రిటైరయ్యాక ఆధారమవుతుందని కష్టపడి కట్టుకున్నారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నా వల్ల కాదు. ఈ విషయంలో దయచేసి మీరింకేం మాట్లాడవద్దు" అని నా ముందరి కాళ్ళకి బంధం వేశాడు.

కళ్ళనీళ్ళతో అతని వంక చూస్తుండడం తప్ప ఏం చేయలేకపోయాను.

అదయిన రెండు నెల్లకి–

"సంస్థ పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయింది. నాకు మరో చిన్న ఉద్యోగం దొరికింది. ఈ ఇంట్లో వుండడం నాకు బరువవుతుంది. మిమ్మల్ని వదిలి వెళ్లలేం. అలా అని వుండలేము. మీ ఆత్మీయతని మేం మరచిపోలేం. మళ్ళీ మంచిరోజులొస్తే తప్పకుండా మీ వాటాలోకి మేము అద్దెకొస్తాం. ఇక్కడ నుండి ఖాళీ చేసి ఎక్కడికి వెళ్ళినా మిమ్మల్ని చూడడానికి వస్తానే ఉంటాం. వచ్చే ఆదివారం ఇల్లు ఖాళీ చేస్తాం. మమ్మల్ని ఆశీర్వదించండి" అన్నాడు.

ఏమంటాను ? వాళ్ళు మనుషుల్లో బంగారాలు. ఉండమంటే వుండడు. ఏమీ చేయలేని పరిస్థితి. మనసంతా చేదుగా వుంది.

****

**త**లుపు కొట్టిన చప్పుడైంది.

మా ఆవిడ కన్నీళ్ళతో చూసింది.

నేను లేవలేదు.

"ట్రాలీలో సామాను ఎక్కించడం పూర్తయ్యింది. మీకు బాధ కలిగిందని తెలుసు. కాని ఏమీ చెయ్యలేని పరిస్థితి. మిమ్మల్ని వదిలి మేము మాత్రం వెళ్ళగలమా ? కానీ తప్పదు. దయచేసి తలుపుతీసి మమ్మల్ని దీవించండి. మీ ఆశీర్వాదం మాకు ముఖ్యం. కాదని మీరు తలుపు తియ్యకపోతే మేము నిరాశగా వెళ్ళిపోతాం" అన్నాడు గాద్గదికమైన గొంతుతో.

"తాతయ్యా.... ప్లీజ్ తలుపులు తియ్యవా" పిల్లల గొంతు విన్పించేసరికి ఇహ వుండబట్టలేక తలుపు తీశాను. అందరం బాధాతప్త హృదయాలతో నిలబడ్డాం.

''రాజరావూ, నువ్వు నాకేమవుతావు ? కొడుకువైతే నాకు దూరంగానే వుంటావు... కాని నువ్వు నా మనసులోకి వచ్చావు. ఈ బంధం ఏమిటో విచిత్రంగా వుంది. పిల్లలు దూరంగా వెళ్ళి మోడైపోయిన మా జీవితాల్లో వెలుగు పూలు పూయించి... మళ్ళీ అంతలోనే అమావాస్య చీకట్లను నింపడం ఏం న్యాయం ? నీ పరిస్థితి బాగున్నంత వరకు అద్దె ఇచ్చావు. ఇప్పుడు పరిస్థితి బాగా లేదు. మనది కేవలం అద్దె బంధమేనా ? అదే అయితే అద్దె ఇచ్చి మాకు దగ్గరవ కుండా వుండాల్సింది. కానీ నువ్వలా లేవే ? మమ్మల్ని చూసే దిక్కులేక అనాథల్లాగా పోతామనుకున్నాం. కానీ భగవంతుడు మాకు నిన్ను దగ్గర చేశాడు. మా పక్క వాటాలో నువ్వున్నప్పుడు... మా దగ్గర ఒకవేళ చిల్లిగవ్వలేక.... మేము మంచాన పడితే మీరు ఇలాగే వెళ్ళిపోయేవారా ? అలా అయితే... ఇప్పుడూ వెళ్ళిపోండి. మేము మనసు రాయి చేసుకుంటాం" అన్నాను.

ఆ మాటకి రాజారావు చలించిపోయాడు. నా కాళ్ళ మీద పడిపోయాడు.

"అమ్మాయీ.... ట్రాలీలో ఎక్కించిన సామాను దించి ఇంట్లో పెట్టించు" అన్నాను.

రాజారావు ఏం మాట్లాడలేదు.

పిల్లల కళ్ళలో కన్నీళ్ళు పోయి కళ వచ్చింది.

"కాకపోతే ఒక షరతు అబ్బాయీ... నీ పరిస్థితి మెరుగైతే మాత్రం అద్దె ఇవ్వాల్సిందే!" అన్నాను నవ్వుతూ.

రాజారావు నన్ను అభిమానంగా ఆలింగనం చేసుకున్నాడు. నాకు ఎందుకో అది మా అబ్బాయి చెప్పని పరిష్వంగాన్ని గుర్తు చేసింది. ☆



PREVIOUS NEXT